శామీర్‌పేట ఎంఈవోగా కమలాకర్

శామీర్‌పేట్: శామీర్‌పేట మండల విద్యాధికారిగా బొమ్మరాసిపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమలాకర్ గురువారం నియమితులయ్యారు. ఇంతకుముందు ఎంఈఓ వసంతకుమారి ఇటీవలే ఉద్యోగ విరమణ పొందారు. ఆమె స్థానంలో కమలాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎమ్మెల్యేను కలిసిన కార్పొరేటర్



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.కోటి నిధులు మంజూరు కాగా, కార్పొరేటర్ మేకల సునీతరాము యాదవ్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గౌతంనగర్‌లోని పలు కాలనీల్లో నిధులు లేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి వివరించడంతో పాటు డివిజన్‌కు రూ.కోటి నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, నర్సింగ్ రావు, కిట్టు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ



సర్టిఫికెట్, మెడల్ అందజేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ జడ్పీ పాఠశాల విద్యార్థి గంగుల త్రిశాంక్ ప్లాంక్ విన్యాసంలో విరామం లేకుండా నిమిషం పాటు ప్లాంక్ చేసి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. గురువారం పాఠశాలలో తైక్వాండో అకాడమీ మాస్టర్ రమేశ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ అజామోహినుద్దీన్ సమక్షంలో త్రిశాంక్ ను, అదేవిధంగా ఎల్లో బెల్టులు సాధించిన వైష్ణవి, గీతికకు సర్టిఫికెట్, మెడల్స్ అందచేసి అభినందించారు.

'లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి'



మల్కాజిగిరి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

మల్కాజిగిరి: జగిత్యాలలో ఆశ కార్యకర్తపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఆశ వర్కర్స్ యూనియన్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల నాయకులు హేమలత, బంగారు నర్సింగరావు మాట్లాడుతూ.. ఘటన జరిగి 20 రోజులవుతున్నా నిందితుడిని పట్టుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించాలన్నారు. అలాగే ఆశ వర్కర్లకు వ్యక్తిగత, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో నాయకులు హేమలత, వసంత, చంద్రకాంత, సంతోష, మాధవి, రాణి, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



గౌతంనగర్: వివేకానంద రైసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గౌతంనగర్ వివేకానంద విగ్రహం వద్ద తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కుమ్మరి రాజు మాట్లాడుతూ.. రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అందరికీ అర్థమయ్యేలా ఐదు రోజుల్లోనే రచించిన గొప్ప కవయిత్రి మొల్లమాంబ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు మహ్మద్ రషీద్, వెంకటరమణ, శ్రీరామ్‌యాదవ్, లచ్చయ్య, దశరథ్, వంశీ పాల్గొన్నారు.

ఎలిఫెంట్ కాలనీలో ఎన్నో సమస్యలు!

అధ్వానంగా అంతర్గత రోడ్లు, వెలగని వీధిలైట్లు

- ఇంటింటికీ ఇవ్వని తాగునీటి నల్లా కనెక్షన్లు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టని అధికారులు



ఎలిఫెంట్ కాలనీ



రెండేళ్ల క్రితమే చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులు

కీసర: నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి, గోధుమకుంట పరిధిలోని ఎలిఫెంట్ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలైనా రోడ్లు, తాగునీటి సరఫరా, వీధిదీపాలు సరిగా వెలగక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంపల్లి, గోధుమకుంట రెవెన్యూ పరిధిలో సుమారు 60 నుంచి 70 ఎకరాల్లో విస్తరించిన ఎలిఫెంట్ వెంచర్‌లో సుమారు 900 వరకు పేద, మధ్య తరగతి కుటుంబాలు, చిరు ఉద్యోగులు, ఇండ్లు నిర్మించుకున్నారు. తాము అన్ని రకాల ట్యాక్స్‌లు చెల్లించినా తమకు సౌకర్యాలు కల్పించడంలో వివక్ష చూపుతున్నారని వారు వాపోతున్నారు. 2022లో జలమండలి అధికారులు కాలనీకి తాగునీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. పనులు పూర్తయి ట్రయల్‌రన్ సైతం నిర్వహించి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు ఇండ్లకు తాగునీటి నల్లా కనెక్షన్లు ఇవ్వలేదని వాపోతున్నారు. దీంతో దిక్కులేక బోరు నీరు తాగుతుండడంతో అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని, మరోవైపు అంతర్గత రోడ్లు కూడా అధ్వానంగా మారాయని, ఒకటి రెండు రోడ్లు మాత్రమే మున్సిపల్ నుంచి నిధులు వెచ్చించి సీసీ రోడ్లు వేశారని, మిగితా చోట్ల ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిదీపాల్లోనూ సగం వరకు వెలగడం లేదని, ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



కాలనీలో అంతర్గత రోడ్లు దుస్థితి

తాగునీటిని సరఫరా చేయాలి..



ఎలిఫెంట్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులను రెండేళ్ల క్రితమే పూర్తి చేశారు. రాంపల్లి ప్రధాన రహదారిలోగల సంప్ నుంచి కాలనీవరకు ట్రయల్ రన్ కూడా నిర్వహించిన అధికారులు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నల్లా కనెక్షన్లు ఇచ్చి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలి.

–కోటేశ్వరరావు, ఎలిఫెంట్ కాలనీ నివాసి

సీసీ రోడ్లు వేయాలి..



ఎలిఫెంట్‌కాలనీలోని అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏళ్లుగా గోస పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలోని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా నిర్మించాలి.

సునీల్‌రెడ్డి, ఎలిఫెంట్ కాలనీవాసి

కాలనీలో వసతులు కల్పిస్తాం..

ఎలిఫెంట్‌కాలనీలో వసతులు కల్పిస్తాం. తాగునీటితో పాటు, రహదారులు, వీధిదీపాల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతాం. ఇప్పటికే కొన్ని పనులు పూర్తి కాగా, మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

భాస్కర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కమిషనర్

నందనవనం పార్కును కాపాడుకుంటాం

కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, కాలనీవాసులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లోని నందనవనం పార్కును కాపాడుకుంటామని జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. పార్కులో కొందరు దుండగులు కబ్జా చేయడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో కలిసి గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2021లో అప్పటి ప్రభుత్వం దాదాపు రూ. 35 లక్షల వ్యయంతో సర్వే నెం.510లో 17 గుంటల్లో నందనవనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అయితే ఈ భూమిని స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహకారంతో స్థానిక బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఉదయం పార్క్‌లోని వస్తువులను కొందరు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికై నా ఎమ్మెల్యే మల్లారెడ్డి చిత్తశుద్ధిని నిరూపించుకుని పార్క్ స్థలాన్ని కాపాడి, బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జవహర్‌నగర్ కమిషనర్ వసంత ఫిర్యాదు చేసిందని, పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేణు ముదిరాజ్, నాయకురాలు లత, వినయ్‌కుమార్, మిట్టూ, కాలనీవాసులు పుష్పలత, ఐలమ్మ, రత్న, బాలమణి, మౌనిక, రవీంద్రారెడ్డి, సందీప్, రాంబాబు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం, గోధుమలు పట్టివేత

మల్కాజిగిరి: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం, గోధుమలను సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ టీం స్వాధీనం చేసుకున్నది. డీఎస్పీ రమేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌బాగ్‌లో ఆదిల్ అనే వ్యక్తి రేషన్ బియ్యం, గోధుమలు నిల్వ చేశారనే సమాచారంతో దాడులు చేసి 77 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 22 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దాడుల్లో సీఐ సైదులు, ఎస్ఐ కృష్ణ, సివిల్ సప్లై విభాగం ఏఎస్‌సీఓ సంధ్య, ఆర్‌ఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మల్కాజిగిరి: సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్, సీనియర్ నాయకుడు బక్క నాగరాజు మాట్లాడుతూ.. బాలసరస్వతీనగర్, ఇందిరా నెహ్రూనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా రెండు ప్రార్థనా మందిరాలు నిర్మిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే సాయినగర్, ఆనంద్‌బాగ్ చౌరస్తాల్లో ట్రాఫిక్ నెలకొంటున్నదని రోడ్డు విస్తరణ చేపట్టాలని, దోమల బెడద ఎక్కువగా ఉందని తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వరలక్ష్మి, బాలచందర్‌గౌడ్, రమణారెడ్డి ఉన్నారు.

మేడ్చల్‌లో వింత దొంగతనం

ఇంట్లోని నల్లాల అపహరణ



సీసీ కెమెరాలో చోరీ దృశ్యం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వింత దొంగతనం జరిగింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి గేట్ దూకి వాష్ ఏరియాలో ఉన్న వాటర్ ట్యాప్స్ (నల్లాలు) ఎత్తుకెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకి వచ్చిన యజమాని నల్లాలకు ట్యాప్స్ లేకపోవడంతో ఇంట్లోని, సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించగా ఓ గుర్తుతెలియని వ్యక్తి గేట్ దూకి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం చోరీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చిల్లర దొంగలు నల్లాలు కూడా వదలడం లేదని పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

సీఎస్‌ఆర్ నిధులు కేటాయించండి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- ఈసీఐఎల్ సీఎండీకి వినతిపత్రం అందజేత



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: సీఎస్‌ఆర్ నిధులు కేటాయించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. ఈమేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సీఎస్‌ఆర్ నిధుల వినియోగంపై చర్చించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో సీఎస్‌ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎండీ ప్రశంసించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రభుత్వ పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు సీఎస్‌ఆర్ నిధులు కేటాయించాలని, అలాగే సంస్థలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎండీ తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు వారు తెలిపారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. వారి వెంట మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశాఖకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి కర్ణన్



రిసాసిటేషన్ సెంటర్ ప్రారంభంలో ప్రముఖులు

శామీర్‌పేట్: ప్రభుత్వం ఆరోగ్యశాఖకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గురువారం రిసాసిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి రిసాసిటేషన్ అకాడమీ ఇదేనని, ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి సెంటర్లు ఉన్న 30 దేశాల్లో మనదేశం చేరడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం ఈఎంఆర్‌ఐ డైరెక్టర్ డా. జీవి రమణరావు మాట్లాడుతూ.. ఆకస్మిక కార్డియాక్ అరెస్టులలో (ఎస్‌సీఏ) శాతాన్ని తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు ఈఎంఆర్‌ఐ ద్వారా 108 అంబులెన్స్‌లు 30 కోట్లకు పైగా కేసులకు అటెండ్ అయ్యాయని, ఇందులో 80 లక్షల మంది ప్రాణాలను రక్షించాయన్నారు. కార్యక్రమంలో ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ అధ్యక్షుడు సుబోధ్ సత్యవాడి, రిసాసిటేషన్ అకాడమీ ఫౌండర్ ఆన్ మిచెల్ డాల్, యూఎస్‌ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మార్కస్, సింగపూర్ ప్రభుత్వ ప్రొఫెసర్ డాక్టర్ మార్కస్ ఓంగ్, డైరెక్టర్ యూపీఈసీ మిచెల్ డాల్, సింగపూర్ జనరల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు



దీక్షలో కూర్చున్న నాయకులు

కీసర: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేవరకు గ్రూప్ 1,2,3, తో పాటు అన్ని రకాల ఫలితాలు నిలిపేయాలని డిమాండ్‌చేస్తూ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు కీసరలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష నాలుగో రోజుకు చేరుకున్నది. గురువారం కీసర చౌరస్తాలోగల అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన దీక్షలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మంచాల మహేందర్, నేతలు శీలం మల్లేశ్, కర్రె గణేశ్, తుడుం శ్రీనివాస్, రవి, శ్రీశైలం, లక్ష్మణ్, రాహుల్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీటీడీ డిప్యూటీ డైరెక్టర్, ట్రెనింగ్ అండ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సనత్ కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ సుధీర్‌కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, డీన్ సతీశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



అహ్మద్‌గూడలో ఆలయాల సమీపంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

కీసర: కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని కీసర సీఐ కె. శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కాలనీలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు కాలనీ అసోసియేషన్, ఆలయాల కమిటీ సభ్యులు ముందుకువచ్చి దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలోని 3 ఆలయాల వద్ద కీసర పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాకు స్పందన



మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్ తెలిపారు. ఫాక్స్‌కాన్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్లుగా దాదాపుగా 54 మంది నిరుద్యోగులు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. టీఎస్‌కేసీ ప్లేస్‌మెంట్ కన్వీనర్ డా. తిరుపతయ్య మాట్లాడుతూ.. ఉప్పల్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 31 మంది విద్యార్థులు ఉద్యోగం పొందడం అభినందనీయమన్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 23 మంది నిరుద్యోగులు కూడా జాబ్ పొందారని తెలిపారు. కార్యక్రమంలో కేఎస్‌టీ మూర్తి, రేణుక, పి.విజయ్‌కుమార్, డా. ఆర్ చంద్రసాగర్, డా. ఎల్ చంద్రకళ, ఎం. మమత, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హోలీ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పోచారం: పోచారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో గురువారం చోటీ హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే శుక్రవారం నిర్వహించనున్న హోలీ సంబరాలకు నారపల్లిలోని ఎంజేఆర్ మాల్, చౌదరిగూడలోని సీబీఎస్ గార్డెన్, కొర్రెముల్‌లోని క్రికెట్ మైదానం ముస్తాబయ్యాయి. పలువురు సెలబ్రిటీలు, నాయకులు, యువకులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే ఆటపాటలు, రెయిన్ డ్యాన్స్‌లు విశేషంగా ఆకట్టుకోనున్నాయి.



చోటి హోలీలో యువత



హోలీకి సిద్ధమైన వేదిక



హోలీ సామగ్రి కౌంటర్



సిద్ధమైన సౌండ్ సిస్టం